తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 15 - 03 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

# పది తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

## లయన్స్ క్లబ్, చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు ముగిసే వరకు పంపిణీ



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండలంలో మూడు కేంద్రాల్లో పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న 346 మంది విద్యార్థులకు శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చైత్ర ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శాలిగౌరారం తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ తో కలిసి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గత మూడు సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల దప్పిక తీర్చడానికి చల్లటి మజ్జిగను విద్యార్థులకు పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు నిత్యం సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు విద్యార్థుల వేసవి దాహార్తిని తీర్చడానికి మజ్జిగను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మందుల సైదులు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ డిసి మెంబర్ డెంకల సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేష్, సభ్యులు మారోజు వెంకటాచారి, బట్ట చిన సైదులు, కప్పల శ్రీకాంత్, నాయకులు చిత్తలూరి జీడికల్లు, వడ్లకొండ పరమేష్, జమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సాయం అందజేత

ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామానికి చెందిన గోళ్ల విజయ్‌కుమార్ అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న పవన్ సాయి హాస్పిటల్ అధినేత ఆలేటి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి భవిష్యత్‌లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపతి శ్రీనివాస్ గౌడ్, బొడ్డిపల్లి జానీ, మారోజు చారి, గొల్ల మల్లేష్, బందెల పరమేష్, బందెల రవి, కత్తుల శేఖర్, కత్తుల పరమేష్, రాజు, నవీన్, సందీప్, సంతు తదితరులు పాల్గొన్నారు.



# విధి పెట్టిన పరీక్ష

## ఓవైపు గుండెపోటుతో తండ్రి మృతి

## మరోవైపు పది పరీక్షలు



కూరెళ్ల ఎల్లయ్య

- దు:ఖాన్ని దిగమించి పరీక్ష రాసిన కొడుకు
- మోత్కూరులో విషాదకర ఘటన

**ప్రజావారధి/మోత్కూరు**

విధి ఎప్పుడు ఎవరి జీవితాల్లో విషాదం నింపుతుందో తెలియని పరిస్థితి. అప్పటి వరకు అంతా సాఫీగా సాగుతున్న ఆ కుటుంబంలో తండ్రి మరణం తీరని విషాదాన్ని నింపింది. గుండెపోటుతో తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబం తీరని దు:ఖంలో మునిగిపోగా, పదవ తరగతి చదువుకున్న కొడుక్కు అదే రోజున పది వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో చదువుకుంటేనే భవిష్యత్ అన్న తండ్రి మాటలతో దు:ఖాన్ని దిగమింగి ఆ కొడుకు పరీక్ష రాశాడు. ఆ విషాదకర ఘటన శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కూరెళ్ల ఎల్లయ్య(50) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. గుండాల మండలం వస్తాకొండూర్ ప్రభుత్వ స్కూల్‌లో పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం గుండెనొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో నల్లగొండలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందిన తర్వాత ఆరోగ్యం కొంత కుదుట పడగా సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మళ్లీ హఠాత్తుగా గుండెపోటు రావడంతో భువనగిరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గుండెపోటుతో తండ్రి చనిపోయి ఉండగానే శనివారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో పదవ తరగతి చదువుతున్న చిన్న కొడుకు హర్షవర్ధన్‌కు కుటుంబ సభ్యులు, బంధువులు పరీక్ష రాయాలని నచ్చజెప్పడంతో గుండె నిబ్బరంతో కన్నీటిని దిగమించి పరీక్షకు హాజరయ్యాడు. ప్రభుత్వ టీచర్ ఎల్లయ్య మృతితో గాంధీనగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా పెద్ద కొడుకు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా, కూతురు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఎల్లయ్య గుండెనొప్పితో నల్లగొండ ఆస్పత్రికి వెళ్లినప్పుడే చికిత్స పొంది సాయంత్రం ఇంటికి రాకుండా ఆస్పత్రిలోనే ఉండి ఉంటే కొడుకు బతికేటోడని కాలనీవాసులు, పలువురు చర్చించుకోవడం కనిపించింది.

## ప్రముఖుల సంతాపం

గుండెపోటుతో మృతి చెందిన ఎల్లయ్య భౌతికకాయాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. వారితో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ జి.లక్ష్మినర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, గుండాల ఎంఈవో మన్నె అగ్గిరాములు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అమరేందర్ రెడ్డి, మధుసూదన్, డి.వెంకటయ్య, గుండాల మండల అధ్యక్షుడు జంపాల రాజు తదితరులు నివాళులర్పించారు. ఎల్లయ్య అంత్యక్రియల్లో కాలనీవాసులు, యువకులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామపంచాయతీ వర్కర్ కొంపెల్లి రవిపై అధికారులు  చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన కొత్తోజు జ్ఞానేశ్వర్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో కొంత కాలంగా మంచినీటి సమస్య ఉందని, తమ కాలనీకి సరిగా నీళ్లు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి శోభన్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరానని, సర్పంచ్‌తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారన్నారు. ఇంతలో గ్రామపంచాయతీ వర్కర్ రవి తనకు ఫోన్ చేసి నీళ్లు రావడం లేదని పంచాయతీ కార్యదర్శికి ఎందుకు చెప్పావని, అకారణంగా దౌర్జన్యంగా మాట్లాడుతూ తనను నానా బూతులు తిట్టాడని, నీ సంగతి చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవో, ఎంపీవో, సీఐ, సర్పంచ్‌కు ఫిర్యాదు చేశానని, అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.